# అబ్బూరి వరదరాజేశ్వర రావుతో



కన్యాశుల్కం నాటక ప్రదర్శనకు 'నటాలి' మధురవాణి పాత్రకు ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. చాలామంది నటీమణులు తమ అభినయాన్ని చూపించి వెళ్తున్నారు. నిజ మధురవాణి సైతం ఆ పోటీలో పాల్గొంటుంది చమత్కారంగా

**వరద:** నిజ మధురవాణీ కంగ్రాట్సు ఇది వరకు చార్లీచాప్లిన్‌కు కూడా ఇటువంటి మర్యాద జరిగింది చార్లీచాప్లిన్ వేషం వేసి నాయనకు ఫస్టుప్రయిజూ, ఛాప్లిన్‌కు రెండవ ప్రయిజు వచ్చింది

**మధుర:** చౌకబారు రచయితలు మహాకవులు లాగా చెలామణీ అవుతుంటే మీలాటివారు నిశ్శబ్దంగా సహించి వూరుకోవడం ఏమీ బాగాలేదు

**వరద:** ఫామిలీ ప్లానింగ్ పెట్టినట్లే కవిత్వాలు ఎక్కువగా రాసే జబ్బు వున్నవాళ్ళకి దోయాతీన్ బస్ అనే రూలు పెట్టాలి

**మధుర:** (నవ్వి) మహాత్ముడిని మీరు చూశారా?

**వరద:** 1929లో మహాత్ముడు బెజవాడ వచ్చారు తన ఖద్దరు నిధికి తోడ్పడమని అన్నారు వేదిక దగ్గరకు వెళ్ళి నా ఉంగరాన్ని మహాత్మునికిచ్చాను 'నాకిమ్మని నీకెవరు చెప్పారు' అని వారు ప్రశ్నించారు. 'నాకెవరూ చెప్పలేదు నా అంతట నేనే ఇస్తున్నానని అన్నాను మహాత్ముడు నన్ను చేరదేసి 'పిల్లలుభాగవత్స్వ రూపులు' అన్నారు ఆ ఉదంతం అప్పటి ఆంధ్రపత్రికలో అచ్చయింది

**మధుర:** మీరు భగవంతుడ్ని ఎప్పుడు శంకించడం ప్రారంభించారు

**వరద:**మా మేనత్త బియ్యం చెరుగుతున్నప్పుడు ఓ పద్యం అతి నాజూగ్గా చదవడం విన్నా తరువాత మా అత్తయ్య చదివిన పద్యం రాసిన ఆయన విశ్వనాథ వారని తెలుసుకున్నా.

**మధుర:** చిత్రం చిత్రం మహాచిత్రం పరమ ఆస్తికులైనా విశ్వనాధ వారి పద్యం భగవంతుడు ఉన్నాడా లేడా అని శంకించేలా చేసిందా? ఏవిటి ఆ పద్యాలు?

**వరద:** (ఆలపిస్తాడు) నా కనుల యెట్టయెదుట నా జనకుని
నా జనని కుత్తుకల గోసి నన్నడిగె
నతండు 'నే దయాంబుధినికాదా' యటంచు
ఓప్రభూ! అగునంటి నే నొదిగియుండి

నా కనుల యెట్ట యెదుట నా లతాంగి
ప్రాణములు నిల్పునందీసి యడిగె నను న
తండు 'నేదయాంబుధిని కాదా' యటంచు

రి వరదరాజేశ్వరరావు

ఓ ప్రభూ! యగునంటి నే యొదిగి యొదిగి
నా కనుల యెట్టయెదుట నా యనుంగు
తనుజు కుత్తుక నులిమి తా నడిగెన
తండు 'నేదయాంబుధిని కాదా' యటంచు,
ఓ ప్రభూ! నీవయంటి నే నొదిగి పోయి

**మధుర:** వచన పద్యం మీకు నచ్చుతుందా?

**వరద:** వచన పద్యమేమిటి మిల్లు ఖద్దరులాగ

**మధుర :** మీ నాన్న గారి మంగళసూత్రం కథలో ఇతర వ్యాసాలలో అంతర్వాహినిగా ఒక చిన్న విషాదపుజీర ప్రవహించేది అది ఏమిటి?

**వరద:** మా చిట్టి చెల్లెలు సుజాత వ్యాధిపీడితురాలయి పోయింది ఆ విషాదం నుంచి వెంటనే మేమెవ్వరం కోలుకోలేదు నేను పద్యాలు కూడా రాశా!

నాన్నగారి వేదాంతము నెన్నిసార్లు
వినుచు నోపికపట్టగలవని తలచి
స్వామి గుడి వాకిలిం గాంచ ప్రార్థనమ్ము
చేసినా నొకమారు నా చెల్లి కొరకు

ఈ పద్యాన్ని సత్యనారాయణ గారు మెచ్చుకున్నారు

**మధుర:** కవి కుమారుడు కవి కుమారుడే అవుతాడు మీరు పండిత పుత్రులు కాలేదు

**వరద:** ''నీవు విసరిన పూలమాలిక దైవ సన్నిధి చేరలేక
అపుమాపుము ఆర్తనాదము, ఆలయమునకె పోదము'' అని నేను స్కూల్లో చేరక ముందు రాస్తే పురిపండా, శ్రీశ్రీ అంతాడంగైపోయారు నాధాటికి మొదట నన్ను అడ్మైర్ చేసి నన్ను చివరి దాకా ఫాలో అయినది మిసెస్ ఏ వి ఎన్ కళాశాలకు అనుబంధంగా వుండే స్కూల్లో సహ విద్యార్థి రాచకొండ విశ్వనాథ శాస్త్రి

**మధుర:** మీనాన్నగారి వల్ల మీ యిల్లు ఒక కవుల ట్రాఫిక్ ఐలండులా వుండేదనుకుంటా!

**వరద:** పురిపండాగారి ఖాదీ భాండార్ ఒక ట్రాఫిక్ సాహిత్య జంక్షన్ అయితే మా యిల్లు ఆధునిక కవులకి ఒక కూడలి యూనివర్సిటీ సంగతి సరేసరి మూడవ పీఠం, బిరుదు పిండప్రదాత బుర్రాశేషగిరి రావు గారిది, ఆంధ్ర భారతీతీర్థం ఆ సంస్థస్నాతకోత్సవం విశాఖపట్నంలో జరిగింది అక్కడికి పురిపండా, శ్రీశ్రీ, తురగా వెంకట్రామయ్య వగైరా నన్ను తీసుకెళ్ళి నాచేత నా అముద్రిత నాటకం 'తపోభంగం' చదివించారు. రతీమన్మధుల కథ అది అంతా శిష్టవ్యవహారికం నాముందు కూర్చున్న తెలుగు మాస్టారు గిడుగు రామమూర్తి పంతులుగారు నానాటకం వ్రాతప్రతిని పంతులు గారు చూసి అక్కడక్కడ సరిచేశారు ఆయన పరిచయ ప్రభావం వల్లనేను పరీక్షల్లో వ్యాకరణం ప్రశ్నలు ముట్టుకునే వాడ్ని కాదు

**మధుర:** మీ మొదటి కథ ఎప్పుడు అచ్చయింది?

**వరద:** జ్వాల 1934 నవంబరు సంచికలో ప్రథమ యుద్ధం కథపేరు.

**మధుర:** మీరెవ్వరికీ సాధారణంగా నమస్కారం చెయ్యరని విన్నా.

**వరద:** దువ్వూరి రామిరెడ్డి గారికి చేశా, ఆయన పద్యాలంటే ప్రాణం

**మధుర:** ఇంతకీ మీది ఏ పార్టీ

**వరద:** 1940 జూన్‌లో రాడికల్ డెమాక్రాటిక్ పార్టీని ప్రారంభించాం మా పార్టీలో మిసిమి ఆలపాటి రవీంద్రనాధ్ గారు కూడా వుండేవారు

**మధుర:** అన్నట్లు సంపంగితోట ఎవ్రాశారు? తరువాత చాలా మంది వాటాకు తయారయారు, ఎందుకు?

**వరద:** నేను, శ్రీశ్రీ మాతో బాటు శ్రీరంగం నారాయణ బాబూ పనిచేశాడు శ్రీరంగం నారాయణ బాబుకి సంపెంగ తోట కర్తృత్వంతో ఏమీ సంబంధం లేదు దానికి మ్యూజిక్ బాలాంత్రపు రజనీకాంతరావు చేశాడు

**మధుర:** మీకు సూతాశ్రమం తెలీకుండా వుండదు

**వరద:** నటాలిని చీరాలనుంచి తెనాలికి మార్చాం సూతాశ్రమంలో గోపీచందూ ఆయన తమ్ముడు గోకుల్ చందూ వుండేవారు పి వి సుబ్బారావూ, మద్దిపట్ల సూరీ, బైరాగీ నేనూ కలిసేవాళ్ళం. గాంధీ చౌకుదగ్గర గుడ్‌విల్ అండ్ కో అని వుండేది ఆదుకాణంలోకి సాయంత్రం నాలుగవగానే మాధవ పెద్ది బుచ్చి సుందర రామశాస్త్రి వచ్చేవారు గాంధీ చౌకులో మరో దుకాణానికి చక్రపాణి వస్తూవుండేవాడు అక్కడికే ధనికొండ హనుమంతరావు కూడా వచ్చేవాడు

**మధుర:** మాయసుందరి గొడవేవిటి? అన్నట్లు మీకెవరో చిన్నపుడే సాష్టాంగపడ్డాడట ఆ విశేషం?

**వరద:** వాడా? శిష్టా ఉమామహేశ్వరరావు నన్ను చూసి నేలమీద పడ్డాడు నవమి చిలుక అదీరాశాడు ఎక్సెంట్రిక్ ఫెలో - హెరాల్డు బ్రిగ్‌హవుస్ ఇంగ్లీషులో రాసిన 'ది ప్రిన్స్‌హువజ్ ఎఫైపర్' అనే నాటకాన్ని 'ప్రతిమా సుందరి'గా అనువాదం చేశా ఇదంతా గుంటూరులో కూర్మావేణుగోపాలస్వామి నాయుడుగార్ని రిహార్సల్సుకి తీసుకొచ్చానేనే చీటికీ మాటికీ స్టేజి వెనకాలకి వచ్చి ఎవరికీ సంబంధించని సూచనలు యిచ్చేవారు నేను ఆక్షేపణ చెప్పా మాయా సుందరి అని పేరు మార్చి అదే నాటకాన్ని నాట్య సమితి చేత వేయించడం ప్రారంభించారు నా పేరు లేదు

**మధుర:** ఇదేమి చాంచల్యం?

**వరద:** అప్పుడు బెజవాడలో మల్లాది వారి అధ్వర్యంలో ప్రతిమాసుందరి అచ్చుయి రిలీజయింది నటాలి అధ్వర్యంలో మానాన్నగారి పర్యవేక్షణలో రెండు వందల నలభై సార్లు తెలుగు దేశం అంతటా ప్రదర్శించారు

**మధుర:** వర విక్రయంలో సింగరాజు లింగరాజు వేసిన బలిజేపల్లి లక్ష్మీకాంతం గారు మీకు తెలుసా?

**వరద:** మానాన్నగారంటే ప్రాణం, మదరాసులో కన్యాశుల్కం వేసినపుడు అగిహోత్రావధాన్లు వేసి అమోఘంగా నటించారు నేనూ, లక్ష్మీకాంతంగారూ, శ్రీశ్రీ, నళినీ కుమార్ (పూర్వం ఉండవల్లి సూర్యనారాయణ ఆఫ్ విజయనగరం ఫేమ్ లక్ష్మీ కాంతంగారి మేన కోడలు డ్క్టార్ వరం తరచు కలిసి తిరిగేవాళ్ళం మాంబళం వీధుల్లో)

**మధుర:** ఇలా రోడ్ల మీద తిరగటమేనా, యింకేమైనా చేశారా?

**వరద:** మొదట ఆంధ్రప్రభలోనూ తర్వాత ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోనూ సబ్బింగ్‌చేశాక మదరాస్ వార్‌రెవ్యూ అసిస్టెంటు ఎడిటర్‌గా వెలగబెట్టా శ్రీశ్రీ నేనూ వారం వారం కలిసే వాళ్ళం శిష్టా, జరుక్ శాస్త్రి వస్తూండే వారు నేనప్పుడే రుక్కుటేశ్వర శతకం అని ముప్పయ్ పద్యాలు రాసి శ్రీశ్రీ కిచ్చా వాడెక్కడో పారేశాడు

**మధుర:** శ్రీశ్రీ కవిత్వానికి ఒక పత్రిక పెడతానన్నార్ట?

**వరద:** పత్రిక ముఖ పత్రం మీద చెళ్ళ పిళ్ళ వేంకటశాస్త్రి గారి అరచేతుల్ని ముద్రిస్తాననేవాడు ఆయన వేళ్ళు బాగా కనపడాలన్నాడు ఇద్దరం కడియం వెళ్దామనుకున్నాం ఇద్దరి దగ్గరా డబ్బుల్లేవు, ధ్వని దాని షే

**మధుర:** (నవ్వి) తరువాత 'కవిత' పెట్టింది మీరేగా?

**వరద:** నేను, రాయప్రోలు రాజశేఖర, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసు, అజంతా మాతోపాటు శ్రీశ్రీ ఒకకొత్త మలుపు తేవాలని ఉబలాటపడ్డాం మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు చాలా సంతోషించారు విశ్వనాధ వారు కవితకు తప్పకుండా రాస్తామన్నారు సంవత్సరానికి మూడుసార్లు విడుదల చెయ్యాలని

**మధుర:** కవితకు సంపాదకీయం మీరురాశారా, నాన్నగారా?

**వరద:** స్వవిషయ సూచిక అని ఆస్కార్‌వైల్డ్ పిక్చర్ ఆఫ్ డోరియన్‌గ్రేకు రాసినవి అనువాదం చేసి తొలిపుటలో వేశాం రామణీయకాన్ని సృష్టిస్తాడు కళాస్రష్ట, నీతికరం, అవినీతికరం అంటూ గ్రంధాలు లేవు, బాగా వ్రాసిన పుస్తకాలూ, బాగా వ్రాయని పుస్తకాలూ, అంతే-

**మధుర:** కవులకొటేషన్లు పట్టు కుంటే కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లు వుంటుంది అతనేగదా యావత్కళా నిష్ప్రయోజనకరం అంది కళ విలువను నిర్ణయించాల్సింది దాని రామణీయకతను బట్టికాదు, ఋజుమార్గ ప్రవర్తనను బట్టి అని అతనేగా అన్నాడు?

**వరద:** టి యస్ ఇలియట్ వాక్యాలు కూడా కొన్నివేశాం సరిహద్దులను కరిగించడమే కవిత్వం మాహాత్మ్యం శ్రీశ్రీ 'నగరంలో వృషభం' తొలిప్రచురణ కవితలోనే ఆరుద్రగుమాస్తా ప్రేమగీతం, అజంతా ప్రసిద్ధమైనచెట్లుకూలుతున్న దృశ్యం, తిలక్‌గొంగళిపురుగు, పఠాభి మాత్రాఛందస్సులు అచ్చయింది అందులోనే

**మధుర:** మీరు నిజంగా పెద్ద సారువారు. మీరుజైల్లో వున్నారట- గిరీశం గారిలా గొడవల్లోపడి నలిగిపోలేదు కద!

**వరద:** రాజకీయఖైదీగా జులై 1948లో రాజమండ్రి సెంట్రల్‌జైల్లో నిర్బంధంలో వున్నా

నాపూర్వజీవితాన్నీ హైదరాబాద్ అనుబంధాల్నీ శంకించి నన్ను నిర్బంధంలో వుంచి నాచేత ఆధునిక ప్రారంభకావ్యం 'చిరకాలం' రాయించారు.

**మధుర:** ఏమిటి కథ?

**వరద:** జైల్లో ఉరికోసం నిరీక్షిస్తూన్న ఒక ఖైదీ వుంటాడు. అతను కట కటాల మధ్యవున్నా నిరంతరం మృత్యుసన్నిధిలో వుండేవాడు అతను నిరపరాధి నని చెప్పుకుంటూ తనపై అధికారులు మోపిన నేరం గురించి చెప్పేవాడు. తనకెలాగూ చచ్చిపోవాలనివుంది. తనపై ఆరోపించిన నేరం గురించి బాధ పడేవాడు. అప్పటి రాజకీయ పక్షాలన్నిటిలో పనిచేశాడు. ఎవరూ తనక్కావలసిన సహాయం చెయ్యలేకపోయారు. నిరుద్యోగంలో, కఠిన దారిద్ర్యంలో - కుటుంబం భార్యాపిల్లలూ ఆకలికి తట్టుకోలేకపోయారు. అందరూ కలిసి ఆత్మహత్య చేసుకుందామనుకున్నారు. కత్తితో పొడుచుగున్నప్పుడు పోలీసులు వచ్చి పట్టుగున్నారు అదీ అతని కథ ఈ ప్రపంచంలో తనకు ఆధారం లేనపుడు ప్రపంచాన్ని వదిలేసి పోవటానికి తనకు హక్కులేదా అని అతని వాదన! ఇక్కడే బాగుంది, బయట బాధే బాబూ, మాలాటి వాళ్ళ కనేవాడు

**మధుర:** చిన్న ఆశాకిరణం కూడా లేని జీవితాన్ని కవులు చిత్రించడం న్యాయమా? నిరాశామయ లోకంలో కదన శంఖం పూరిస్తున్నానన్నాడు మీ పేదలకని.

**వరద:** కలకాలం చెరకాలం

సిలువై తుది కావ్యమై స్పృశించెను వరదా! అన్నాడు శ్రీశ్రీ తన తోపాటు తీసుకెళ్ళి నావ్రాత ప్రతిని ఎక్కడో పారేశాడు మావాడు.

ఒకసారి అందులో కొన్ని ఖండికలు తెలుగు స్వతంత్రలో గోరాశాస్త్రి ప్రకటించాడు ఏవో పొగుచేసి 'అందాక' అని అచ్చువేశా

**మధుర:** తిరిగి మళ్ళీ రాయమని ఎవరూ బలవంతపెట్ట లేదా?

**వరద:** అందులో చాలా వరకు సంప్రదాయ ఛందస్సు వాడా నాకే, అంతా అడిగినా, మనస్కరించక రాయలేదు. అది రాసినపుడున్న దృష్టివేరు చాలా వరకు రాసింది, వ్యవహారిక భాష. మాత్రాఛందస్సుల ముత్యాల సరాలు కూడా వున్నాయి

**మధుర:** మరి మీ స్నేహితులంతా ఛందస్సుల మీద విరుచుకు పడతారేం?

**వరద:** రాయటం రాక. తెలుగువాడి ఆస్తి తెలుగు పద్యమే గదా! కృష్ణశాస్త్రిగారు కూడా అభినందించారు. ఒకటి గుర్తు.

> కారుమబ్బు వానకారు, వాగులుపొంగు
> నిండి నదులు, వరద నింగి కెగసె
> వాన లోన నీవు వాన కావల నేను!
> అంతె బతుకు, చివరికంతె అంతె

**మధుర:** వానలోన నేను, వాన కావల మీరు చాలా గొప్పగా అన్నారు మీరు పండిత నెహ్రూని ప్రెస్ మీట్‌లో కంగు తినిపించారట

**వరద:** నెహ్రూగారు ప్రజాస్వామ్యపాదుషా. స్వాతంత్ర్యం కోసం పోరాడిన నెహ్రూవేరు, ప్రధాని నెహ్రూ వేరు. అడిగా, దేశమంతటా పర్యటిస్తున్నారు గదా కాంగ్రెస్ విజయావకాశాల గురించి మీ అంచనా ఏమిటి? అని. ఏవో ఒకటి రెండు చోట్ల తప్ప మొత్తం మీద కాంగ్రెసు విజయదుందుభి మ్రోగిస్తుంది, అన్నారు. ఒకటి రెండు చోట్ల మాత్రం కాంగ్రెసు ఎందుకు ఓడిపోవాలి అని అడిగా. దీనికి తికమకపడి జేబులోంచి సిగరెట్ తీసి ఒకటి ముట్టించారు. గాంధీ టోపీ తీసి తలతడుముకున్నారు. కాంగ్రెసు ఎందుకు ఓడిపోతుందంటే ప్రజలు తెలివైనవారు కాబట్టి అన్నారు. అంటూ ఆయన నవ్వేశారు రెండో ప్రశ్న. కాంగ్రెసులో అవినీతి పెరిగిపోయిందని వినవస్తున్నది దీనికి మీరేమంటారు అన్నా, నెహ్రూ జవాబు ఈ కూత కూసింది ఎవరు? కాంగ్రెసులో అని నీతి ఉందనడం అసంబద్ధ ప్రేలాపన. నిజానికి అవినీతి విషయంలో ప్రతిపక్షాలు పరమ అధ్వాన్నం. అని ఆయన కోప్పడ్డారు విరుచుకుపడి నాకేసి తిరిగి మిస్టర్ నీ ప్రశ్న నాకు కోపం తెప్పించింది నాకోపం నీ మీద కాదు అన్నారు

**మధుర:** నెహ్రూగారు హైదరాబాద్ ది మిశ్రమ సంస్కృతి అనీ భాషా ప్రయుక్తరాష్ట్రాలుగా దాన్ని విడదీయడం తగదనీ గొడవ పడ్డారు ప్రెస్‌మీట్‌లో - ఏమాకథ?

**వరద:** నీవు చెప్పినట్లే సమ్మిశ్రిత సంస్కృతీ కేంద్రం అది అలాగే వుండాలన్నారు మరి ప్రజలు భాషా ప్రయుక్త రాష్ట్రాలు కోరుతున్నారు కదా అని ఒకరన్నారు. 'ప్రజలు పొరబడితే దిద్దే బాధ్యత మనది' అన్నారు నెహ్రూ ప్రజలంతా అలా కోరితే మీరు అనుమతించక తప్పదు కదా అని నేనన్నాను. అలాకుదరదు. ప్రతి తలుపూ తట్టి మీరు చేసేది మంచి పని కాదు అని నేను చెబుతా. హైదరాబాద్ రాష్ట్రాన్ని యథాతథంగా వుంచేట్టు ప్రయత్నిస్తాను అన్నారు నెహ్రూ. అప్పుడు నేను కొంచెం ధైర్యం చేసి 'అలా మీరు చేస్తే భారత ప్రధానికి, వెనకటి నిజాంకు ఏమిటి భేదం' అన్నా. నెహ్రూ మొగం ఎర్రగా మారింది బల్ల మీది సిగరెట్టు డబ్బా నేలకేసి కొట్టారు. నేను లేచి ఆడబ్బా తీసి ఆయన బల్లమీద పెట్టా, నావంక చూసి గట్టిగా నవ్వుతూ 'నేను చెప్పింది జాగర్తగా ఆలోచించు' అంటూ లేచారు. నేను పక్కన చేరి అన్నా! 'సమ్మిశ్ర సంస్కృతి ఏమైన ధర్మబద్ధమా?' అని. యింకా విపులంగా వివరించా నిజాం చేసినవి. తన ఉద్దేశం అది కాదనీ ఉన్న పరిస్థితి గురించి మాట్లాడుతున్నాననీ పండిట్‌జీ అన్నారు.

**మధుర:** అయితే హైదరాబాద్ నగర చతుశ్శతాబ్ది ఉత్సవాన్ని జరపాలంటారా? వద్దా?

**వరద:** ఈ నగరం వయస్సు నాలుగు వందలయితే అందులో రెండు వందల ఏళ్ళకు పైన అసఫ్‌జాహీ వంశస్థుల పాలనలో గదా యీ నగరం వుందీ! ఏనుగుల వీరాస్వామి గారి కాశీయాత్ర కూడా అప్పుడు జరిగింది. ఆయన ఆనాటి రాజకీయ పరిస్థితి కళ్ళకు కట్టేట్టు రాసి చక్కాపోయాడు. మతసామరస్యం అనేది దేవుడెరుగును. శాంతిభద్రత శూన్యం. ప్రజల దోపిడీ ప్రధానం. వారు తెలుగు భాషని ఆదరించారని డబ్బాకొట్టు కోవడం కంటితుడుపే. తెలుగు భాషకి సంస్కృతికీ ఏమీ ఉపకారం జరగలేదు. అసఫ్‌జాహీ వంశస్థులు అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ జరిగింది తెలుగుకి అపకారమే. నగరంలో

మరీనూ. కమ్యూనిస్టులూ, కాంగ్రెసువాదులూ, యితర దేశభక్తులూ అసఫ్‌జాహీదుష్ట పరిపాలనకుస్వస్తపలికించేందుకు మహత్తరమయిన త్యాగాలు చెయ్యవలసి వచ్చింది. ఈ నగరానికి చతుశ్శతాబ్ది ఉత్సవం ఎలా చేస్తారో ఎదురుచూస్తున్నాం

**మధుర:** కుహనాలౌకిక వాదులవల్లా వారి దురవగాహన వల్లా యిలాటి దిక్కుమాలిన పరిస్థితులు వస్తాయి ఈ ఊరు కంపునీ దారుల్నీ బాగుచేసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేయక దిక్కుమాలిన ఉత్సవాలు ఎందుకు? ఇంతకీ భాగ్మతి అనే ఆవిడ వున్నట్టా లేనట్టా?

**వరద:** భాగ్మతిగా ఆవిడ్ని ప్రేమిస్తే ఆవిడ సంస్కారాన్ని గౌరవించక పాదుషా యీ వూరిని హైదరాబాదు అనడం ఏం కర్మ? చారిత్రకంగా యీ కథకు దాఖలాల్లేవంటారు విజ్ఞులు

**మధుర:** శుభ్రంగా విజయవాడ, గుంటూరుల మధ్య వాంఛూ చెప్పినట్లు ఆంధ్రరాజధానిని కట్టుకుని వుంటే బాగుండేది? ఈ నిజాం బిల్డింగులు వగైరా విసర్జించిన దానికి ఎగబడి తెలుగు వినబడే చోట్ల కట్టుకోకుండా దిగబడ్డారు తెలుగువారు, దీన్ని రాజధాని అంటూ

**వరద:** ఇక హైదరాబాధ వదిలేయ్

**మధుర:** అకాడమీలు స్థాపించాలని మీనాన్నగార్ని అంకురార్పణ పనులు చేసిపెట్టమన్నార్ట పట్టాభి రామారావు గారు

**వరద:** చదలవాడ పిచ్చయ్య ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి, నార్లగారికీ మా నాన్నగారికీ హైదరాబాద్‌లో వున్న సాహిత్య వాతావరణం గురించి తెలీదు అందుకని నన్ను సంప్రదించారు ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ప్రకాశం గారిని దింపి నీలం సంజీవరెడ్డి గారు ముఖ్యమంత్రయ్యారు ఆ తతంగంలో నాదీ వుంది కీలకపాత్ర

**మధుర:** మీరు రామప్పంతుల్లా వ్యవహారాల్తో యమ బిజీగా ఉండేవారన్న మాట

**వరద:** పబ్లిక్ రిలేషన్స్ మీద ఓ పుస్తకం రాశా నేను బి ఏ ఆనర్సు తరువాత ఎం ఏ చేశా ఆరుద్ర లాగ యఫ్ ఏ కవినిగాను దలైలామా తప్పించుకుని ఇండియా వచ్చినపుడు దలైలామా అండ్ ఇండియా, ఇండియన్ పబ్లిక్ అండ్ ప్రైమ్ మినిస్టర్ ఆన్ టిబెటన్ క్రయిసిస్ అనే గ్రంధాన్ని సంకలనం చేసి ప్రచురించా 1958 నెహ్రూ గారి జన్మదిన సందర్భంగా మోడ్రన్ ఇండియన్ పొయిట్రీ - ఏన్ ఎంథాలజీ' అనే గ్రంధాన్ని సంకలితం చేసి నెహ్రూకి బహూకరించా 'ఇండో ఆంగ్లియన్ పొయిట్రీ' కవిత క్రింద ప్రచురించా అస్సామీస్ కవితా సంకలనం, షష్టిబ్రతా అనే బెంగాలీ కుర్రాడి పొయిట్రీ వేశాం

**మధుర:** జాగ్రత్తగా ఉంటే గిరీశం గారు కూడా మీ అంత ప్రజ్ఞ ప్రతిభ కలవారు అయ్యేవారనుకుంటా పూటకూళ్ళమ్మ దగ్గర చేరడం వల్ల అలా అయాడు కాని ప్చ్!

**వరద:** నే నెక్కడ వాడెక్కడ నీకతని మీద వున్న గురికి జాలిగా వుంది

**మధుర:** మీరు విస్కాన్సిన్‌లో తెలుగు విజిటింగ్ ప్రొఫెసర్‌గా వున్నారట అలాటి ఉద్యోగం మా గిరీశం గారికి వస్తే జమాయించేవాడు

**వరద:** అప్పుడు తిరుపతి జి. యస్. రెడ్డిగారు, చేరాగారు అక్కడ ఉండేవారు. న్యూయార్క్‌లో మన మందుమిత్రుడు ఎ. ఆర్. కృష్ణ కేరాఫ్‌లో మన మకాం.

**మధుర:** సాహిత్యంతోనూ సాహిత్యేతర విషయాలతోను రాజకీయాలతోనూ రాజకీయేతర విషయాలతోనూ విద్యారంగంతోనూ మీకు సత్సంబంధాలున్నాయి. మీరు క్రికెట్‌లో ఆల్‌రవుండర్ లాటి వారు.

**వరద:** నేనేం కపిల్‌దేవునీ, సునీల్ గవాస్కరునీ కాను నీ గిరీశాన్ని అంతకంటే కాను, నాకు బిరుదులక్కర్లేదు సన్మానాలు అంతకంటే అక్కర్లేదు.

**వరద:** చాలాకాలం పి.వీ గార్కి, రాజీవ్‌గారి కాలంలో, మీరు పి. ఏ గా వుండేవారట.

**వరద:** ఒకప్పుడు, ఇప్పుడు మా ఆవిడకు పి. ఏ గా ఉంటున్నా

**మధుర:** మీరు మల్లాది వారితో 'వరద రాజేశ్వరరావు అంత్యక్రియలు' రాస్తున్నానని చమత్కరించారట!

**వరద:** ప్రతిపాదాంతంలోనూ క్రియ వచ్చేట్టు రేశా, ఆరుద్ర కూడా చేశాడీపని ఢిల్లీలో మా నాన్నగారి దర్శకత్వంలో 'కన్యాశుల్కం', 'మృచ్ఛకటికం' వేశాం అప్పుడు నువ్వొస్తే బాగుండేది కదా!

**మధుర:** మీ నాటకంలో మధురవాణిగా నేను పనికొస్తానా?

**వరద:** అయిదు రోజుల పెళ్ళిలా జరిగిందా కార్యక్రమం ఢిల్లీలో

**మధుర:** మీరు విశాఖలో సెటిలవక హైదరాబాద్ చేరారేం? కాల్పనిక సాహిత్యానికి పెద్ద భవిష్యత్తు లేదన్నార్ట మీరు?

**వరద:** లేదు, రాసేవాళ్ళు మానేశారు రాయగూడని వాళ్ళు విజృంభించిపోతున్నారు ఆవిష్కర్మలు అంకితాలు, సన్మానాల జోరు ఎక్కువైపోతోంది

**మధుర:** మీ నాన్న గారి పద్యాలు పురాణం పట్టుకపోయి వేశాడ్ట ఆంధ్రజ్యోతిలో

**వరద:** ఒకటి గ్యాపకం

చచ్చిపోయి జీవి యెచ్చట కేగునో
ఏమి యగునో యెవరికెరుగ రాదు
ఎరుకలేని వారలే మేము చెప్పగా
విని తపించు వారు వేన వేలు

**మధుర:** తెలుగువాడి గురించి మీ వ్యాఖ్య వినాల నుంది

**వరద:** తెలుగువాడు దుర్యోధనుడిలాంటివాడు దుర్యోధనుడు తనకేమీ కావాలనడు. ధర్మరాజుకి మాత్రం ఏమీ ఉండకూడదంటాడు తెలుగువాడూ అంతే I had a loving quarrel with the world

**మధుర:** మీతో హస్కు కొడుతున్నానని గిరీశం గారు కోపం చేస్తున్నారు. ఛీరియో!

*('మిసిమి' అక్టోబర్, 1996)*